
"లోకం బీదోల్లను బతుకనిచ్చేటట్లు లేదు సారు !" అంటూ వచ్చాడు బాలయ్య

దైన్యం గూడు కట్టుకున్న మొహం. అరవై ఏళ్ళు నిండినా ఆ కళ్ళల్లో బ్రతకాలన్న ఆశ కొడిగడుతున్న దీపంలా మెరుస్తోంది. ముడుతలుపడ్డ శరీరం గత కాలపు జీవిత కష్టాలను దాచుకొన్నట్లుగా ఉంది. దశాబ్దాలుగా కష్టానికి అతడి శరీరం కాస్త వంగిపోయి అనుభవాల ప్రోదిలా ఉంది.




బాలయ్య బ్రతకడానికొచ్చాడు ఆ ఊరికి. పన్నెండేళ్లుగా అక్కడే ఉంటూ అదే తన ఊరు అనుకున్నాడు.

"ఏమైంది బాలయ్యా వేదాంతం మాట్లాడుతున్నావు?". అడిగాడు రంగయ్య మాస్టారు.

రంగయ్య మాస్టారు ఆ ఊరి హైస్కూలులో ఉపాధ్యాయుడు ఎనిమిదేళ్లయింది. ఆ ఊరు వచ్చి ఊరు, ఊరి వాతావరణం, అక్కడి ప్రజలు అతడికి బాగా అవగతమయ్యాయి ఈ ఎనిమిదేళ్ళలో.

"ఏదాంతం ఎందుకైతది సారు? ఏడెనిమిదేండ్ల బట్టి మీరు సూత్తనే ఉన్నరు కద నా బతుకు....." ఆగిపోయాడు బాలయ్య "ఇప్పుడేమయింది మరి?" ఆశ్చర్యంగా అడిగాడు రంగయ్య మాస్టారు.

"అంతా అయిపోయింది సారు... ఊరు ఊరంతా నా మీద కచ్చకట్టింది. నా గుడిసెను, నా బతుకును పీకి పారేస్తున్నరు !" అలా అంటుంటే అతడి కంఠం రుద్ధమైంది.

"ఎందుకు?" మాస్టారికేమీ అర్థం కాలేదు.

"పన్నెండేండ్ల కింద ఈ ఊరుకు బతుకనీకె ఒచ్చిన సారు. బస్టాండు కాడ గుడిసె ఏసుకోనీకి మీ పెద్దబడి సారు ఒప్పుకున్నడు. గా గుడిసె ఏసుకొని చాయ, బజ్జీలు అమ్ముకుంట బతుకు ఎల్లదీస్తున్న.... ఇప్పుడు మీ పెద్దసారు నేను గుడిసె ఏసుకున్న సోటు మీదంగ కంపోండు గోడ కడ్తడంట. గుడిసె తీసేయమంటున్నడు!"

అప్పుడర్థమయింది రంగయ్య మాస్టారికి.

ఈ మధ్యనే పాఠశాలకు హెడ్మాస్టరుగా వచ్చిన సాయిరెడ్డి ఆ ఊరివాడే ! పాఠశాల చుట్టూ కాంపౌండు గోడ కట్టాలని పాఠశాలలో చదివి వివిధ ఉద్యోగాల్లో ఉన్న మాజీ విద్యార్థుల వద్దకు వెళ్ళి ఇరవై వేల దాకా డబ్బు జమ చేశాడు.

కాంపౌండు గోడ సరిగ్గా బాలయ్య చాయ గుడిసె గుండా వెళుతుంది. కాబట్టి తీసేయమని అని ఉంటాడు.

"నీ గుడిసె వరకు వదిలి మిగతాది కట్టొచ్చు కదా బాలయ్యా?" అన్నాడు మాస్టారు.

"ప్రతిరోజు నాకు కలలొస్తున్నాయి, కన్నెపిల్లలెందరో నా రూంలోకి వస్తూ వెళ్తూ కన్పిస్తున్నారు" చెప్పాడు మోహన్.

"అలా కలలోకి రావడం మీకు బాధగా ఉందా?" అడిగాడు డాక్టర్.

"అది కాదండీ ఆ వచ్చిన వాళ్ళు రూంలోనే ఉండిపోక మళ్ళీ వెళ్ళిపోతున్నారు... అదే నా బాధ?" అన్నాడు మోహన్.

— అబ్దుల్ గఫూర్, మోర్తాడ్



"నేను అట్లనె అన్న సారు. ఉహుఁ ఎవ్వరూ ఇంటనే లేరు. దినమంత చాయ అమ్ముకుంటే పదో ఇరవయ్యో మిగిల్తె దానితోనె నా పెండ్లం పిల్లలు బతుకుతున్నరు సారు.

గిప్పుడా గుడిసె తీసేత్తె నేను యాడేసుకోవాలె. బస్టాండ్ల ఉన్నందుకు అంతో ఇంతో నడుస్తున్నది. అది తీసేత్తే నా బతుకు తెల్లారిపోతది సారు. నిన్నటి కాడి నుండి తిండి కూడా సయిత్తలేదు. రాతిరంత కంటి మీద నిద్ర కూడా లేదు. నా పెండ్లం పిల్లలు ఆగమయెటట్లుండరు సారు !" బాలయ్య కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. పై పంచెతో కళ్ళు తుడుచుకున్నాడు.

పరాయి దేశం నుండి వచ్చిన కాకిని స్థానిక కాకులన్నీ కలిసి తరుముతున్నట్లు అనిపించింది రంగయ్య మాస్టారికి. జాతి ఒక్కటే అయినా ఈ విభేదాలు ఎందుకో? పాపం పొట్ట చేతపట్టుకొని వచ్చాడు. పొట్టగడుపుకోడానికి టీకొట్టు వేసుకున్నాడు. ఉదయం అయిదు నుండీ రాత్రి పది గంటల దాకా శ్రమిస్తే ఏ పాతికో పరకో మిగుల్తాయి ఖర్చులు పోను.

ఇన్నేళ్ళుగా వ్యాపారం చేస్తున్నా అతడు సంపాదించింది ఏమీ లేదు. ఏదో కాస్త మంచి పేరు తప్ప !

"బాలయ్యా ! నేను సాయిరెడ్డి సారుతో మాట్లాడి చూస్తాను.

"సారు ! మీ కాల్లు పట్టుకుంట. నన్ను ఇట్ల బతుకనీయమని సెప్పండి. ఆ జాగలో ఎన్నాళ్లున్నా నా సొంతమైతదా ఏంది? ఈ పానం గాలిల కలిసిపోతె అయిపాయె. పోయేనాడు అన్ని కట్టపోతమా ఏంది. నేనేం ఉత్తగ ఉంటలేను గదసారు. నెలకు పది రూపాయలు ఇస్తున్న".

"అలా మాట్లాడకు బాలయ్యా... నీవూ మనిషివే. వాళ్లూ మనుషులే ! మనిషిని మనిషి అర్థం చేసుకోకపోతే మానులు, మాకులు అర్థం చేసుకుంటాయా చెప్పు? నేను చెప్పి చూస్తాను !" భరోసా ఇచ్చాడు రంగయ్య మాస్టారు.

మొహంలో ఆశలు నింపుకొని వెళ్ళిపోయాడు బాలయ్య.

* * *

"నమస్కారం సార్ !"

"నమస్తే. నమస్తే ! రండి పొద్దున్నే బయల్దేరారేమిటి?" బలవంతంగా నవ్వు తెచ్చుకుంటూ ఆహ్వానించాడు సాయిరెడ్డి, రంగయ్య మాస్టారిని.

"మీతో కలుద్దామనే వచ్చాను" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు రంగయ్య మాస్టారు.

"చెప్పండి" తాను కూర్చుంటూ అన్నాడు సాయిరెడ్డి. ముసలితనం మీద పడ్డా డబ్బు మీద మోజు పోలేదు సాయిరెడ్డికి. పాఠశాలలో డబ్బుకు సంబంధించిన అన్ని వ్యవహారాలు ఆయనే చూసుకుంటాడు. ఏ ఉపాధ్యాయుణ్ణీ నమ్మడు.

"మన పాఠశాలకు కాంపౌండు గోడ కట్టిస్తున్నారట కదా?" అన్నాడు రంగయ్య మాస్టరు విషయానికి ముందుమాటగా.

"అవును. మీరు చూస్తూనే ఉన్నారు కదా! స్కూలు గ్రౌండుకు కాంపౌండు లేక ఏ బిచ్చగాడు వచ్చినా స్కూళ్ళోనే మకాం పెడ్తున్నాడు. ఇక సాయంత్రం పూట, సెలవు రోజుల్లో ఊళ్ళో ఉండే జులాయి యువకులు పేకాటకు, మద్యపానానికి దాన్నే ఉపయోగించుకుంటున్నారు. ఇక వాళ్ళ వీళ్ళ పశువులు మన స్కూలు గ్రౌండులోనే మేస్తున్నాయి" ఉపన్యాసంలా మాట్లాడుతున్నాడు సాయిరెడ్డి.

అదీ నిజమే!

"పాపం. బాలయ్యను గుడిసె ఖాళీ చేయమన్నారట గదా?"

"ఆఁ గోడ సరిగ్గా వాడి గుడిసె ముందునుండే వెళుతుంది".

"అది వదిలేసి గోడ కట్టొచ్చు కదా. పాపం గుడిసె పీకేస్తే అతడి జీవనమే చితికిపోతుంది. ఏదో బ్రతకడానికొచ్చాడు. మనకేమైనా నష్టమా?" నెమ్మదిగానే అడిగాడు రంగయ్య మాస్టారు.

"లేదు సార్. గుడిసె ఉండడానికి వీలే లేదు. విద్యా కమిటీ కూడా అదే తీర్మానం చేసింది. అయినా వాడు మన ఊరి వాడా ఏంటి?" కాస్త ఉద్రేకం తొణకిసలాడింది— ఆయన గొంతులో. "అందుకే కదా.... పాపం బ్రతకడానికొచ్చాడు. ఏదో టీకొట్టు నడుపుకొని జీవనం కొనసాగిస్తున్నాడు."

"అట్లా అంటె ఎట్ల సార్! చుట్టూ గోడ కట్టి అక్కడ గుడిసెను ఉంచితే ఎంత వికారంగా ఉంటది. ఖాళీ చేయమని చెప్పినం. చేయకపోతే పీకేస్తాం!" మరింత ఉద్రేకం పెరిగింది సాయిరెడ్డి గొంతులో.

ఎంత తేలికగా మాట్లాడుతున్నాడు. ఆయనకేం నెలకు అయిదారు వేల జీతం వస్తుంది. ఓ కొడుకు అగ్రికల్చర్ డిపార్టుమెంటులో డైరెక్టరు. పది వేల దాకా జీతం వస్తుంది మరో కొడుకు, అతని భార్యా ఇద్దరూ టీచర్లే. ఎంతలేదన్నా వాళ్ళకు ఆరు వేలన్నా వస్తుంది. మరో కొడుకు వ్యవసాయం చేస్తాడు. కరువు కాటకాల్లో

కూడా లక్ష రూపాయలకు తక్కువ కాకుండా పంట వస్తుంది. మరి ఆయనకేం తెలుసు బాలయ్యా జీవితం గురించి? అతడేదో టీకొట్టు మీద లక్షలకు లక్షలు సంపాదిస్తున్నట్లు ఊహిస్తున్నారు. ఉదయం నుండీ రాత్రి దాకా చెమటలు కారుస్తూ రెక్కలు ముక్కలు చేసుకుంటే రోజుకి ఇరవై అయిదు రూపాయల ఆదాయం కూడా రాదు. కొందరు టీ తాగేసి తరువాత ఇస్తాం డబ్బులు అంటారు. అది అంతే సంగతులు. ఎముకలు కొరికే చలిని భరిస్తూ చర్మాన్ని చురుక్కుమనిపించే ఎండలను భరిస్తూ వచ్చేపోయే వాళ్ళకు ఆత్మ తృప్తిని కలిగిస్తున్నాడు. ఓ రకంగా చూస్తే అతడు ఎంతోమందికి సేవ చేస్తున్నాడు ఆకలిగన్న వారికి అన్నం వండి పెడతాడు. డబ్బులు తీసుకుంటేనేం ఆ సమయానికి ఆకలిని తీరుస్తున్నాడు. అలాంటి మనిషికి మరికొంత సహాయాన్ని అందించేదిపోయి అతడి జీవన ఆధారాన్నే కూల్చేయాలని ఈ మనుషుల ఆరాటం. మనిషి మీద మనిషికున్న అసూయ ఇదే కాబోలు. బాలయ్యలాంటి వాళ్లను ఈ లోకం ఎందుకు బ్రతకనీయదో?

మనసులో మెదులుతున్న ఆలోచనలను పక్కకు నెట్టి "సార్. పాపం బాలయ్యను బ్రతకనీయండి. అతడి జీవనాధారం ఆ కొట్టు. పొట్ట చేత పట్టుకొని ఈ ఊరు వచ్చాడు. గుడిసెను వదిలేసి చుట్టూ గోడను కట్టేయండి. వచ్చే వాళ్ళు గోడ దూకి అయినా వస్తారు కదా?" అన్నాడు రంగయ్య మాస్టారు.

"లేదు సార్! అందరం నిర్ణయించాం. గుడిసెను తీసేయాల్సిందే! ఖచ్చితంగా చెప్పాడు సాయిరెడ్డి.

అందరూ అంటే ఊళ్ళో డబ్బున్న వాళ్ళంతా అన్నమాట! 'ఇంతమంది కలిసి బ్రతకడానికొచ్చిన ఓ బీదవాణ్ణి తరిమికొడతారన్నమాట! ఎంత అన్యాయం ఇది?" బాధ పడుతూ వెనుదిరిగాడు రంగయ్య మాస్టారు.

ఆయన మనసంతా వికలమయింది. బాలయ్యకు ఏం చెప్పాలి? గుడిసెను పీకేస్తే బాలయ్యా బ్రతుకు రోడ్డున పడుతుంది. పోనీ ఊళ్ళో మరోచోట టీ కొట్టు పెట్టుకుంటే నడుస్తుందా అంటే నడవదు. ఇది బస్టాండు కాబట్టి సాధారణంగా ప్రతి ఒక్కరూ అక్కడికే చేరతారు. అతడికి గిరాకీ అవుతుంది. పరధ్యానంగానే ఇంటికి చేరుకున్నాడు రంగయ్య మాస్టారు.



టీచర్: "ఆరోగ్యమే—మహాభాగ్యం" అని నేను రాయమంటే— "రోగమే—మహాభాగ్యం" అని రాశావేంట్రా??
రాము: "మరి మా నాన్నేమో డాక్టరు— మాకు "రోగాల" వల్లే ఆదాయం వస్తాది కదాసార్!!
—యు. చిట్టిబాబు
కొత్తగూడెం

ఆ సాయంత్రం వచ్చాడు బాలయ్య రంగయ్యమాస్టారి ఇంటికి.

"బాలయ్యా— సార్‌తో మాట్లాడాను నేను. కాని వాళ్లు వినే స్థితిలో లేరు. ఎన్నో రకాలుగా చెప్పిచూశాను. గుడిసె తీసేయించడానికే వాళ్లు నిశ్చయించుకున్నారు. ఊరంతా ఒక్కటైనపుడు మనమేం చేస్తాం బాలయ్యా. ఏది జరగాల్సి ఉందో అది జరుగుతుంది. నీవు నిబ్బరంగా ఉండు. భగవంతుడనే వాడు ఉన్నాడనే నా నమ్మకం. ఏదో ఒకదారి చూపించకపోడు!" అని అన్నాడే గానీ రంగయ్య మాస్టారి మనసులో 'ఏ దారి ఉంది?' అన్న సమస్య మెదడుని తొలుస్తూనే ఉంది.

"ఏడ ఉన్నడు సారు బగవంతుడు. ఆడే ఉంటే నా బతుకు ఇట్ల ఎందుకైతది? ఊరుగాని ఊరొచ్చి నేను బతుకుడేంది? ఈడ గూడ సక్కగ సూసిండా అంటే అదీ లేదు. రెక్కలు ముక్కలు సేసుకున్నగాని సంతోసం, సుకం లేకపాయె. ఇప్పుడేమో మొత్తం బతుకునే ఎత్తి పెంట కుప్పల పారేస్తున్నడు? గిట్ల బతికే బదులు సస్తే మేలు కాదాసారు? ఒక్కసారే పీడపోతది?"

"బాలయ్యా! అంత నిస్పృహంగా మాట్లాడకు బాలయ్యా, మనిషికి ఆశ ఉండాలి. నిరాశతో మనం బ్రతకలేం. ఆశనే మనల్ని ముందుకు తీసుకెళుతుంది. అది లేనివాడు సన్యాసి అవుతాడు. మనం సామాన్య మానవులం. ఆశ లేకుండా బ్రతకలేం. ఈ రోజు అందకపోతే రేపు అందుతుందని ఆశ పడతాం. అలా జీవితాంతం గడుస్తూనే ఉంటుంది. ఇక్కడ కాకుంటే మరో చోట. పనిచేస్తే ఎక్కడైనా కడుపు నిండుతుంది. ఇదేమీ నీకు శాశ్వతమైన ఊరా? ఇది కాకపోతే మరో ఊరు!" అన్నాడు మాస్టారు. అలా అన్నాడే గాని ఊరు వదిలితే ఎంత కష్టమో ఆయనకు తెలుసు. బాలయ్యకు ఏం ఉందని? మరో ఊరికి వెళితే అక్కడ ఎలాంటి కష్టాలో? చేతినిండా డబ్బున్నవాళ్లే ఇబ్బంది పడుతుంటారు. మరి బాలయ్యలాంటి నిరుపేదలు? మరో ఊళ్లో గుడిసె వేసుకోవాలన్నా ఊరివాళ్ల అనుమతి కావాలి. గుడిసె వేసుకోవడానికి అయిదారు వందలన్నా కావాలి. నాలుగైదురోజులు వృధా. ప్రతిరోజూ వ్యాపారం చేస్తుండగానే బొటాబొటిగా ఉన్నపుడు అది అసలే లేనినాడు పస్తులు ఉండాల్సిందే!

ఆలోచిస్తున్నకొద్దీ రంగయ్య మాస్టారి కడుపులో ఎవరో పిసికినట్లు అవుతోంది. చూస్తూ చూస్తూ ఒక మనిషిని నిలువునా కూల్చేస్తున్నారు వీళ్లు. వాడి కష్టాలు వీళ్లకి ఆనందాన్ని ఇస్తున్నాయి. హుఁ. మనిషి ఎంత విచిత్రజంతువు? జంతువు మరో జంతువును తన ఆకలిని తీర్చుకోవడానికి చంపుతుంది. కాని వీళ్లు తమ స్వార్థం కోసం ఒక మనిషిని బలి చేస్తున్నారు.

మానవత్వం ఎక్కడుంది? జీవనాధారాన్ని కూల్చేసి తమాషా చూడబోతున్నారు వీళ్లు. ఎంత ఆటవికం? ఎంత అమానుషం?

"నా దగ్గర కాయితం కూడ ఉండది సారు. అప్పుడున్న పెద్దసారు రాసిచ్చిండు. నీవు ఉన్నంత కాలం ఉండు అని" చెప్పాడు బాలయ్య.

"ఊరు ఊరంతా ఒక్కటైనపుడు ఆ కాయితాలు ఏం చేస్తాయి బాలయ్యా?" నిస్పృహగా అన్నాడు మాస్టారు. "పొద్దటికి గుడిసె పీకేస్తరు సారు. ఇయ్యాల మద్దేనమే సెప్పింద్రు. గుడిసె పోతె నా పానం నిలుస్తదా? నా పాణె, నా గుడిసె రెండూ పోవాల్సిందే!" ఓ నిశ్చయానికి వచ్చినట్లుగా అన్నాడు బాలయ్య.

"అలా అనకు బాలయ్యా— ఈ రాత్రి గడవనీ. పొద్దున్నే చూద్దాం. మరోసారి అడుగుదాం. లేదంటే పైవాడు ఉన్నాడుగా?" అన్నాడు మాస్టారు.

"ఎవ్వరు లేదు సారు. ఇగ ఇంతే!" అనేసి వేదాంతిలా వెళ్లిపోయాడు బాలయ్య. అతడు వెళ్లిపోతుంటే ఒక ఊరే కదిలిపోతున్నట్లుగా అనిపించింది మాస్టారికి.

ఆ రాత్రి చాలా సేపటిదాకా మనసంతా బాలయ్య గురించిన ఆలోచనలే మాస్టారికి. అర్ధరాత్రి దాటినా కంటిమీద కునుకు లేదు. బాలయ్యను బ్రతికించాలన్న ఆలోచనే! క్రమక్రమంగా ఆయన ఆలోచనలన్నీ ఒక విషయం మీద కేంద్రీకరించబడ్డాయి. 'గాంధీగారు చేసింది కూడా ఇదేకదా?' అనుకుని నిశ్చింతగా నిద్రపోయాడు.

★ ★ ★

తెల్లవారేసరికి ఊరంతా పాకిపోయింది ఆ వార్త. 'బాలయ్యకు మద్దతుగా రంగయ్యమాస్టారు నిరాహార దీక్ష!' ఊరు ఊరంతా బాలయ్య టీకొట్టు దగ్గరికి చేరుకుంది. అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు తన ఒళ్లంతా మానవత్వాన్ని నింపుకున్నట్లుగా కొత్తగా కనిపిస్తున్నాడు.